జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ రాజ్యాంగ విరుద్ధం

సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

- నగరంలో బీఆర్ఎస్ నిరసన
- సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు

కార్పొరేషన్, మార్చి 14: రాజ్యాంగానికి విరుద్ధంగా శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అన్యాయమంటూ శుక్రవారం స్థానిక తెలంగాణ చౌక్‌లో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య తోపులాట జరిగింది. అనంతరం బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేసే కార్యక్రమాలు చేపడుతున్నదని విమర్శించారు. సమస్యలను నిలదీయడమే తప్పు అన్నట్లుగా సస్పెండ్ ఉందన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకొని నిరంకుశంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఇలాంటి పాలకులకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ, శాసనసభ నుంచి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి అణచివేత ధోరణితో వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్, షౌకత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

కలెక్టరేట్, మార్చి 14 : రైతుల సంక్షేమమే తమ ధ్యేయమంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి క్షేమాన్ని విస్మరించి పాలన సాగిస్తున్నదని తెలంగాణ రైతుల పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాందాడి వెంకటేశ్వర్లు ఆరోపించారు. శుక్రవారం నగరంలోని ఆసంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన ఉత్తర తెలంగాణ రైతు ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి 20శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న రైతు రుణ మాఫీ సత్వరమే పూర్తిస్థాయిలో చేయాలని, రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని, వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి, మక్కలకు కూడా క్వింటాల్‌కు వెయ్యి రూపాయల చొప్పున బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రాగుల రాఘవరెడ్డి, రఘునాయకుల మహేందర్‌రెడ్డి, చల్లగొండ మనోహర్‌రావు, దీకొండ వెంకటేశ్వర్‌రావు, ముత్తినేని ఆగంరావు, మెన్నేని సత్యంరావు, ఆకుల వీరయ్య, కోల రమేశ్, గసికంటి రాములు, కత్తెర వీరేశం, జున్నూతల రాజయ్య, బొలిశెట్టి రాములు, శివానందం, వీరయ్యతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలుమండలాల నుంచి 50 మంది సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మానవజాతి చరిత్రను మలుపు తిప్పిన కారల్ మార్క్స్

తెలంగాణచౌక్, మార్చి 14 : ప్రపంచ మానవాళి చరిత్రను మలుపు తిప్పిన మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి కొనియాడారు. శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముకుందలాల్ మిశ్రా భవన్‌లో కారల్ మార్క్స్ 142వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, 1846లో జర్మన్ భావజాలం గ్రంథం ద్వారా నూతన సిద్ధాంతమైన గతి తార్కిక భౌతిక సూత్రాలను ప్రతిపాదించారన్నారు. అలాగే ప్రతి పోరాటంలో మార్క్స్ మార్గదర్శకంగా కనిపిస్తాడని కొనియాడారు. మార్క్స్ మరణించి 142 సంవత్సరాలు గడిచినప్పటికీ మానవాళిపై ఆయన ప్రభావం ఇంకా పెరుగుతూనే ఉందన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ పెట్టుబడిదారుల కొమ్ము కాస్తున్నదని ఆరోపించారు. కారల్ మార్క్స్ స్ఫూర్తితో నిరంతర అధ్యయనం, త్యాగ నిరతితో జిల్లాలో బలమైన ప్రజా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు డి. నరేశ్ పటేల్, నాయకులు గజ్జల శ్రీకాంత్, అజయ్, డి. బోగేశ్ రాకేశ్, లక్ష్మి, రోజా తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE

★హైదరాబాద్‌లో నూతన నగరం ఫ్యూచర్ సిటీ శ్రీశైలం హైవే మహేశ్వరంలో ఓపెన్ ప్లాట్స్ కలవు. 100 చ.గజాలు 6 లక్షలు మాత్రమే... మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు... 100% రిటర్న్స్... EMI కలదు. Cont: 8008091512.
NT-330716

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

బీమా డబ్బులు అందజేత

ఎండీ సర్వర్ కుటుంబానికి బీమా డబ్బులను అందజేస్తున్న పొదుపు సంఘం సభ్యులు

శంకరపట్నం, మార్చి 14: తాడికల్ గ్రామంలో ఇటీవల శ్రీవెంకటేశ్వర పురుషుల పొదుపు సంఘం సభ్యుడు ఎండీ సర్వర్ అనారోగ్యంతో మృతిచెందగా అతడి కుటుంబ సభ్యులకు సంఘం ద్వారా వచ్చిన బీమా డబ్బులను శుక్రవారం అందజేశారు. కుటుంబానికి సామూహిక బీమా క్లెయిమ్‌లు 1, 2, అభయనిధి విపత్సహాయం కింద మొత్తం రూ. 70 వేలు నగదు అందించారు. ఇక్కడ పొదుపు సంఘం అధ్యక్షుడు నరహరి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు ఉప్పరి సంపత్, ఆడెపు ఎల్లయ్య, చామంతుల కుమారస్వామి, పూదరి మొగిలయ్య, బొమ్మదేని చంద్రమౌళి, ఆరెపల్లి ఓదెలు, కొత్త ఆనందరెడ్డి, పాంద్రాల శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు పోలు రమేశ్, ఎండీ రఫీ, గణకుడు కొర్మి సారయ్య ఉన్నారు.

నిరుపేద ఆడబిడ్డ పెళ్లికి సాయం

గంగాధర, మార్చి 14 : మండలంలోని కొండాయపల్లి గ్రామానికి చెందిన ద్యావ దుర్గయ్యకు ముగ్గురు కూతుర్లు కావడంతో కూలి పనులు చేసుకుంటూ కష్టాలు పడి ఇద్దరు బిడ్డల పెళ్లిలు చేయగా, ప్రస్తుతం చిన్న కుమార్తె జ్యోతికి వివాహం నిశ్చయమైంది. నిరుపేద కుటుంబ కావడంతో పెళ్లికి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. విషయాన్ని గ్రామస్తుల సహకారంతో నాయకుడు తూడి లచ్చయ్య దృష్టి తీసుకువచ్చాడు. స్పందించిన లచ్చయ్య జ్యోతి పెళ్లి కోసం ఆర్థిక సహకారం అందజేస్తామని తెలిపారు. నిరుపేద యువతి వివాహానికి అండగా నిలిచిన తూడి లచ్చయ్యకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ నాయకుడు మల్యాల వినయ్‌సాగర్ ఉన్నారు.

అనారోగ్యంతో రైతు మృతి

తిమ్మాపూర్, మార్చి14: మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన రైతు కిన్నెర శ్రీనివాస్ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీనివాస్ భార్య అంజలి, కూతురు ఝాన్సీ, కొడుకు గణేశ్ వేడుకుంటున్నారు.


గంగాధర: బూరుగుపల్లిలో హోలీ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, ఉద్యోగులు

వేడుకల్లో బండి సంజయ్ దంపతులు

ఆనందోత్సాహాలతో హోలీ

హోలీ వేడుకల్లో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి తదితరులు

ఆబ్కారీ ఉప కమిషనర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన హోలీ సంబురాల్లో పాల్గొన్న సిబ్బంది

కమాన్‌చౌరస్తా/ తెలంగాణచౌక్/ విద్యానగర్/ కొత్తపల్లి, జమ్మికుంట/ వీణవంక/ ఇల్లందకుంట/ శంకరపట్నం/ సైదాపూర్/ చొప్పదండి/ గంగాధర/ చిగురుమామిడి/ కరీంనగర్ రూరల్/ తిమ్మాపూర్, మార్చి 14: జిల్లా వ్యాప్తంగా రంగుల ఖేలీ హోలీ వేడుకలు శుక్రవారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే అన్ని వర్గాల ప్రజలు రంగులు తీసుకొని వీధుల్లోకి వచ్చారు. కేరింతలు కొడుతూ పరస్పరం రంగులు పూసుకున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి, ఆమె భర్త దీపాంక్‌సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కుటుంబ సభ్యులు హోలీ సంబురాల్లో పాల్గొన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన హోలీ వేడుకలకు హాజరయ్యారు. అలాగే, నగరంలో చిన్నారులు, పెద్దలతో మమేకమై మాజీ మేయర్ సునీల్ రావు రంగులు పులుముతూ శుభాకాంక్షలు తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని నృత్యాలు చేస్తూ, రంగుల చల్లుకున్నారు. ఐఎంఏ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేశ్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించగా, వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించారు. జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఎన్జీవో ఫంక్షన్‌హాల్ ముందు నాయకులు, ఉద్యోగులు డప్పుచప్పుళ్ల మధ్య వేడుకలు జరుపుకొన్నారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది వేణుగోపాల్, మహిళా నాయకురాలు కవిత ఆధ్వర్యంలో చైతన్యపురిలో హోలీ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. గంగాధర మండలం బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హోలీ వేడుకల్లో పాల్గొని ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

హోలీ సంబురాలు జరుపుకొంటున్న నగరవాసులు

నగరంలో విద్యార్థినుల కేరింతలు

హోలీ సంబురాల్లో నృత్యం చేస్తున్న యువతులు

సంబురాల్లో నృత్యం చేస్తున్న యువకులు

నుస్తులాపూర్‌లో..

సెలవు రోజుల్లోనూ యథావిధిగా కౌంటర్లు

కార్పొరేషన్, మార్చి 14: ఈ నెలతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున నగర ప్రజలు పన్నులు చెల్లించడానికి వీలుగా అన్ని సెలవు దినాల్లోనూ నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్లు పని చేస్తాయని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు, ప్రభుత్వ కార్యాలయాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. emunicipal. telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లోనూ డిజిటల్ పేమెంట్ ఇంటి వద్ద నుంచి కూడా చేయవచ్చని తెలిపారు. పన్ను బకాయిదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్తి పన్ను బకాయిదారులకు నోటీసులు జారీ చేసి చట్టపరంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మొండి బకాయిదారుల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, ఇన్‌చార్జి రెవెన్యూ ఆఫీసర్ కరీముల్లా ఖాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, రెవెన్యూ సెక్షన్ క్లర్కులు, ఆస్తి పన్ను వసూలు సహాయక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ మోటర్ చోరీ

శంకరపట్నం, మార్చి 14: మండలంలోని మొలంగూర్ శివారులో కరెంట్ మోటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కన్నాపూర్ గ్రామానికి చెందిన నాయిని శ్రీనివాస్ అనే రైతు మొలంగూర్ శివారులోని వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాడు. ఎస్సారెస్పీ ఉప కాలువకు కరెంట్ మోటర్‌ను బిగించుకుని పొలం సాగు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా కరెంట్ మోటర్ మాయం అయింది. రాత్రి పూట గుర్తు తెలియని దుండగులు కరెంట్ మోటర్‌ను అపహరించారని బాధిత రైతు వాపోయాడు.

అనభేరి ప్రభాకర్ రావుకు ఘన నివాళి

అనభేరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

కమాన్‌చౌరస్తా, మార్చి 14 : తెలంగాణ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, రజాకార్ల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అనభేరి ప్రభాకర్ రావు 77వ వర్ధంతి కరీంనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట గల ఆయన విగ్రహం వద్ద ఎల్లాపు సంఘ బాధ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనభేరి కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎల్లాపు సంఘం అర్బన్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు, కరీంనగర్ రూరల్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు, ఎల్లాపు ఎంప్లాయీస్ అధ్యక్ష, కార్యదర్శులు, ఎల్లాపు కులస్తులు పాల్గొని అణభేరి ప్రభాకర్ రావుకు ఘనంగా నివాళులర్పించారు.

నల్లగొండ జాతర.. బారులు తీరిన బండ్లు

గుట్ట చుట్టూ తిరుగుతున్న ట్రాక్టర్లు

తిమ్మాపూర్, మార్చి14: మండలంలోని నల్లగొండ గ్రామంలోని శ్రీ సీతారామ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శకటోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి వాహనాల్లో భారీగా భక్తులు తరలివచ్చారు. వాహనాలను స్వామివారి గుట్ట చుట్టూ గర్భగుడి చుట్టూ తిప్పారు. అనంతరం భక్తులు వాహన పూజలు చేసుకొని స్వామివారిని దర్శించుకున్నారు. శకటోత్సవంలో మేకల బండ్లు, ఎడ్ల బండ్లు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ స్వామి, ఎస్సై వివేక్ బందోబస్తు నిర్వహించారు. ఆదివారం రాత్రి రథోత్సవం ఉంటుందని ఆలయ చైర్మన్ బండారి లక్ష్మణ్ తెలిపారు.

తేనెటీల దాడిలో నలుగురికి తీవ్రగాయాలు

తేనెటీగల దాడిలో గాయపడ్డ వారిని దవాఖానకు తరలిస్తున్న 108 సిబ్బంది

శంకరపట్నం, మార్చి 14: మోటార్ బైక్‌లపై వెళ్తున్న వారిపై మార్గమధ్యంలో తేనెటీగలు చేసిన దాడిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన దుబ్బాక నర్సయ్య, అతడి భార్య రజిత, కుమార్తె సమ్మెట శ్రీజ, అల్లుడు సమ్మెట మహేందర్ కలిసి రెండు బైక్‌లపై నల్లగొండ జాతరకు బయలుదేరారు. మార్గమధ్యంలో గట్టుదుద్దెనపల్లి కాలువ వద్ద ఒక్కసారిగా తేనెటీగల గుంపు బైక్‌పై వెళ్తున్న వారిపై దాడి చేసింది. ఈ ఘటనలో నర్సయ్య, మహేందర్‌కు తీవ్ర గాయాలు కాగా, రజిత, శ్రీజకు స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108కి సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ గూడూరి సతీష్‌రెడ్డి, పైలట్ నర్రా సదన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అందిస్తూ హుజూరాబాద్ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

అసౌకర్యాలకు కేరాఫ్ అంగన్‌వాడీలు

- కేంద్రాల్లో కానరాని కనీస వసతులు
- కొరవడిన విద్యుత్ సరఫరా
- తాగునీటికి చిన్నారుల తండ్లాట

చిన్నారులకు చిరుప్రాయంలోనే విద్యపై మక్కువ కలిగిస్తూ, వారి భవిష్యత్తుకు వెలుగు బాటలు వేయాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు జిల్లాలో అసౌకర్యాలతో కూనరిల్లుతున్నాయి. సొంత భవనాలతో పాటు అద్దె భవనాల్లో కూడా కనీస వసతులు కానరాకపోవడంతో, కేంద్రాలకు చిన్నారులను పంపేందుకు తల్లిదండ్రులు సంశయిస్తుండగా, గర్భిణులు, బాలింతలు కూడా వచ్చి పౌష్టికాహారం భుజించేందుకు ససేమిరా అంటున్నట్లు తెలుస్తున్నది. దీంతో, అంగన్‌వాడీ కేంద్రాలు జిల్లాలో అనేక చోట్ల బోసిపోయి దర్శనమిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో కరెంట్ సరఫరా లేకపోవడంతో కేంద్రం బయట ఆటవస్తువులతో బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్ (ఫైల్)

కలెక్టరేట్, మార్చి 14: జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వీటిలో 307 మాత్రమే సొంతభవనాల్లో కొనసాగుతున్నాయి. 201 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లోని గదుల్లో కొనసాగుతుండగా, మరో 259 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటిలో 125 కేంద్రాలకు ఇప్పటికీ విద్యుత్ సరఫరా లేదు. 87 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కొరవడగా, 100 సెంటర్లలో మరుగుదొడ్లు లేక ఒంటికి, రెంటికి కూడా వెళ్లేందుకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంగన్‌వాడీ సిబ్బంది పేర్కొంటున్నారు. కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం అక్కడే తినాలనే నిబంధన ఉండడంతో, తాగునీటిని కూడా తమవెంట తీసుకెళ్లాల్సి వస్తున్నదని గర్భిణులు, బాలింతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస వసతుల కల్పనపై నిర్లక్ష్యం

ఓవైపు అంగన్‌వాడీ కేంద్రాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ, ఆంగ్లమాధ్యమంలో పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ప్రకటిస్తున్న ప్రభుత్వం.. మరోవైపు కనీస వసతుల కల్పనపై కూడా దృష్టి సారించకుండా నిర్లక్ష్యం వహిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రాలకు సొంత భవనాలు నిర్మిస్తున్నామని పేర్కొంటున్నా, ఉన్న వాటిలో సౌకర్యాలు కల్పించకపోవడంపై అటు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల్లో, ఇటు చిన్నారుల తల్లిదండ్రుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. జిల్లాలోని అత్యధిక శాతం సెంటర్లలో మరుగుదొడ్లు లేక, తాగునీటి వసతులు కానరాక, విద్యుత్ సైతం లేకపోవడంతో చిన్నారులతో పాటు కేంద్రాల్లో పౌష్టికాహారం తీసుకునేందుకు వచ్చే గర్భిణులు, బాలింతలతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రతిపాదనలకు మోక్షం లభించేనా?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యా బోధనకు నిలయాలుగా, ప్రీ ప్రైమరీ కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దుతామంటూ ప్రకటనలు చేసింది. కనీస సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలంటూ అధికారులను ఆదేశించింది. ఆఘమేఘాల మీద అధికార యంత్రాంగం నివేదికలు రూపొందించి, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే సంబంధితాధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే, అవి మూలకు పడగా, మరోసారి పంపాలని ఆదేశాలు రావడంతో రూ.1.35కోట్లతో రూపొందించిన నివేదికననుసరించి, ఇటీవలే ప్రతిపాదనలు పంపినట్లు సంక్షేమ శాఖ అదికారులు పేర్కొంటున్నారు. ఈసారైనా మోక్షం లభించేనా? లేక మరోసారి అటకెక్కేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మార్చిలోనే ఎండలు మండుతుండగా, వసతులు లేని కేంద్రాల్లోకి వచ్చే వారి సంఖ్య భారీగా తగ్గిపోయే ఆస్కారముంటుందని అంగన్‌వాడీ టీచర్లు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కనీస సౌకర్యాల కల్పనకు అవసరమైన నిధులు సత్వరమే మంజూరు చేసి, పనులు ప్రారంభిస్తే తప్ప కేంద్రాల్లో తగ్గుతున్న సంఖ్యను అడ్డుకోలేమని, అంగన్‌వాడీ టీచర్లు వెల్లడిస్తుండడం గమనార్హం.

నేడు విద్యుత్ అంతరాయం

వీణవంక, మార్చి 14: మండలంలోని బేతిగల్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు టీజీఎన్పీడీసీఎల్ వీణవంక ఏఈ సుర్వేశ్వరాచారి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు బేతిగల్, వల్భాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.